వంటకు మట్టిపాత్రలే ఉత్తమం

వెల్లడించిన ఎన్ఐఎన్

న్యూఢిల్లీ : మట్టి పాత్రల్లో వంట చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) తెలిపింది. పోషకాహారం, ఆరోగ్యంపై విస్తృత పరిశోధనలు, నిపుణులతో సంప్రదింపులు, క్షుణ్ణంగా నిర్వహించే సమీక్షల అనంతరం భారతీయుల కోసం జారీ చేసిన మార్గదర్శకాల్లో ఈ వివరాలను వెల్లడించింది. ఎన్ఐఎన్ తెలిపిన వివరాల ప్రకారం, మట్టి పాత్రలు పర్యావరణ హితమైనవి. వీటిలో వండటానికి నూనె అవసరం తక్కువ. పోషక విలువలను కాపాడే సామర్థ్యం ఈ పాత్రలకు ఉంటుంది. బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్, క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, హెడ్ ఆఫ్ సర్వీసెస్ ఎడ్వినా రాజ్ మాట్లాడుతూ, మట్టి పాత్రల్లో వండటం వల్ల వేడి అన్ని వైపులకు సమానంగా పంపిణీ అవుతుందని, ఆహారంలోని పోషక విలువలను కాపాడుకోవచ్చునని చెప్పారు. నాన్ స్టిక్ కోటింగ్ కోసం టెఫ్లాన్ ఉపయోగిస్తారని, దీనిపై ఆందోళన ఉండేదని, అయితే 2013 నుంచి దీనిని వాడటం మానేశారని చెప్పారు. కానీ నాన్ స్టిక్ ప్యాన్‌ను మితిమీరి వేడి చేయడం ప్రమాదకరమేనని తెలిపారు. నాన్ స్టిక్ కోటింగ్ ముక్కలైపోయి, హానికరమైన పదార్థాలను విడుదల చేయవచ్చునన్నారు. వీటివల్ల ఊపిరితిత్తులు దెబ్బతినవచ్చునని, ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఫుడ్ గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఎంచుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. మట్టిపాత్రలతోపాటు పింగాణి పాత్రలు కూడా సురక్షితమైనవేనన్నారు.

జీన్‌థెరపీతో వినికిడి శక్తి పునరుద్ధరణ

ప్రపంచంలోనే తొలిసారిగా బ్రిటన్ బాలికకు విజయవంతంగా చికిత్స

ఓపల్ సాండీ

లండన్, మే 12: జన్యుపరమైన సమస్యలతో వినికిడి లోపంతో జన్మించిన బ్రిటన్‌కు చెందిన ఎనిమిది నెలల చిన్నారికి జీన్ థెరపీతో వినికిడి శక్తిని పునరుద్ధరించారు వైద్యులు. ఓపల్ సాండీ అనే చిన్నారికి కేంబ్రిడ్జ్‌లోని అడ్డెన్‌బ్రూక్స్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఇప్పుడు ఎలాంటి వినికిడి పరికరం అవసరం లేకుండానే ఈ చిన్నారి వినగలుగుతున్నదని వైద్యులు తెలిపారు. ఈ అధునాతన చికిత్స అందుకున్న ప్రపంచంలోనే మొదటి వ్యక్తి ఈ చిన్నారి. చికిత్సలో భాగంగా ముందు చిన్నారి ఎడమ చెవిలోని కోక్లియా(కర్ణావృత్తి)కి జనరల్ అనెస్తీసియా ఇచ్చారు. తర్వాత వినికిడి శక్తిని పునరుద్ధరించగలిగే జన్యు పదార్థం నకలుతో కూడిన ప్రమాదరహిత ఏఏవీ1 అనే వైరస్‌ను ఆమెకు ఇచ్చారు. ఈ వైరస్ శరీరంలోని కణాలకు జన్యు పదార్థాన్ని సరఫరా చేసి శరీరం నుంచి సహజంగా నిష్క్రమిస్తుంది. ఆ జన్యు పదార్థం వినికిడి శక్తిని పునరుద్ధరించేలా చేస్తుంది. ఈ చికిత్స పూర్తిగా సురక్షితమైనదని వైద్యుడు మనోహర్ తెలిపారు.

పంది కిడ్నీ అమర్చిన వ్యక్తి మృతి

రిచర్డ్ స్లేమాన్

బోస్టన్, మే 12: ప్రపంచంలో తొలిసారి పంది కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకొన్న రిచర్డ్ స్లేమాన్ (62) మృతిచెందారు. రెండు నెలల కిందట మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ వైద్యులు స్లేమాన్‌కు జన్యుమార్పిడి చేసిన పంది కిడ్నీని అమర్చారు. అది విజయవంతం కావటంతో రెండు వారాల అనంతరం డిశ్చార్జి చేశారు. ఆ తర్వాత కూడా ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. తాజాగా ఆయన మరణించారు. అయితే, స్లేమాన్ ఆకస్మిక మరణానికి, శస్త్రచికిత్సకు ఎలాంటి సంబంధం లేదని దవాఖాన వర్గాలు వెల్లడించాయి. అవయవ మార్పిడి వల్ల ఆయన మరణించలేదని పరీక్షల్లో వెల్లడైందని తెలిపాయి. అంతకుముందే ఆయనకు మధుమేహం లాంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయని పేర్కొన్నాయి. కాగా, మూత్రపిండాల వ్యాధితో బాధపడ్డ రిచర్డ్‌కు 2018లో మరణించిన ఓ వ్యక్తి కిడ్నీని అమర్చారు. అయితే, ఇది విఫలం కావడంతో జన్యుమార్పిడి చేసిన పంది కిడ్నీని అమర్చారు.

29వ సారి ఎవరెస్ట్ అధిరోహణ

నేపాల్ పర్వతారోహకుడి రికార్డ్

కాఠ్మాండ్, మే 12 : నేపాల్‌కు చెందిన దిగ్గజ పర్వతారోహకుడు కామి రిటా షెర్పా 29వ సారి ఎవరెస్ట్‌ను అధిరోహించి.. తన రికార్డ్‌ను తానే తిరగ రాసుకున్నాడు. 54 ఏండ్ల వెటరన్ పర్వతారోహకుడు కామి రిటా ఇక్కడి 'సెవెన్ సమ్మిట్ ట్రెక్స్'లో సీనియర్ గైడ్‌గా పని చేస్తున్నారు. అతను ఆదివారం ఉదయం 7.25 గంటలకు ఎవరెస్ట్‌పై 8,849 మీటర్లకు చేరుకున్నాడని ఇక్కడి టూరిజం శాఖ తెలిపింది. కామి రిటా 1994లో మొట్టమొదటిసారిగా ఎవరెస్ట్‌ను అధిరోహించారు. ప్రపంచంలో ఎవరెస్ట్‌ను అత్యధికమార్లు అధిరోహించిన వ్యక్తిగా ఆయన రికార్డుల్లో నిలిచారు.

తెరుచుకున్న బద్రీనాథ్ ఆలయం

డెహ్రాడూన్ : ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయ తలుపులు తిరిగి తెరుచుకున్నాయి. శీతాకాల సీజన్‌లో మూసివేసిన ఆలయాన్ని 6 నెలల తర్వాత ఆదివారం తిరిగి ప్రారంభించారు. చార్‌ధామ్ యాత్రలో భాగమైన బద్రీనాథ్, కేదార్‌నాథ్, యమునోత్రి, గంగోత్రి ఆలయాల్లో అక్షయ తృతీయ సందర్భంగా పూజలు చేసి భక్తుల దర్శనానికి అనుమతి ఇచ్చారు. బద్రీనాథ్ ఆలయ దర్శనం కోసం శనివారం సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో 7.37 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారు.

85% పోస్టులు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకే

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా వెల్లడి

ముంబై, మే 12: ఐటీ రంగం కుదేలవుతున్న తరణంలో, లే ఆఫ్‌లతో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగిస్తున్నవేళ.. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు ఎస్‌బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) ప్రొబేషనరీ ఆఫీసర్లు (పీవో), అసోసియేట్స్‌గా ఎస్‌బీఐ 12వేల మంది (85శాతం) ఇంజనీరింగ్ ఫ్రెషర్స్‌తో నియామకం చేపడుతున్నట్టు బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా చెప్పారు. శిక్షణ అనంతరం 3 వేల మంది పీవో, 8 వేల మంది అసోసియేట్స్‌ను బ్యాంక్ వ్యాపారం, ఐటీ విభుల్లో నియమిస్తామని అన్నారు. 'టెక్ మ్యాన్ పవర్ సరఫరా బ్యాంక్‌కు నిరంతరం ఉండేట్టు ఇది దోహదపడుతుంది' అని దినేశ్ ఖారా వివరించారు.

అట్టుడుకుతున్న పీవోకే

- ఓ పోలీసు అధికారి మృతి, 100 మందికి పైగా గాయాలు
- అధిక పన్నులు, విద్యుత్తు కొరతపై స్థానికుల ఆందోళనలు
- భారత్‌లో కలపాలని పోస్టర్లు
- స్వాతంత్ర్యం కావాలని నినాదాలు

ముజఫరాబాద్‌లో జేఏసీ సభ్యుల నిరసన

శ్రీనగర్/న్యూఢిల్లీ, మే 12: ద్రవ్యోల్బణం, అధిక పన్నులు, విద్యుత్తు కొరతపై పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో జమ్ముకశ్మీర్ సంయుక్త ఆవామీ యాక్షన్ కమిటీ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. పీవోకే మొత్తం హింసతో దద్దరిల్లిపోతున్నది. పీవోకేపై పెత్తనం చేస్తున్న పాకిస్థాన్ ప్రభుత్వంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పట్ల వివక్షాపూరిత వైఖరికి నిరసిస్తూ తిరుగుబాటు ఉద్యమం చేస్తున్నారు. ఆందోళనకారులు పాకిస్థాన్ నుంచి 'ఆజాదీ(స్వాతంత్ర్యం)' కావాలంటూ నినాదాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల పీవోకేను భారత్‌లో కలుపాలని కోరుతూ పోస్టర్లు వెలవడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. పీవోకేలో తాజా పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ ఆలీ జర్దారీ సోమవారం అధ్యక్ష నివాసంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ

భద్రతా దళాలు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఒక పోలీసు అధికారి మరణించగా, 100 మందికి గాయాలయ్యాయని మీడియా నివేదికలు ఆదివారం వెల్లడించాయి. ముజఫరాబాద్, రావాలకోట్ ఇతర చోట్ల పోలీసులతో ఆందోళనకారులు ఘర్షణ పడిన ఘటనలు చోటుచేసుకొన్నాయి. దడ్యాల్‌లో ఆందోళనకారులపైకి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. పీవోకేలోని భింబేర్, బాగ్, మీర్‌పూర్ సహా పలు ప్రాంతాల్లో మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సేవలను ఆదివారం నిలిపివేశారు.

విద్యుత్తు బిల్లులపై పన్నుల భారం

ఈ ఏడాది ఫిబ్రవరిలో కుదిరిన ఒప్పందాన్ని పాటించకపోవడంపై అవామీ యాక్షన్ కమిటీ ఇటీవల ఆందోళనలకు పిలుపునిచ్చింది. విద్యుత్తు బిల్లులపై అన్యాయమైన పన్నులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన అవామీ కమిటీ.. గత ఏడాది ఆగస్టులో కూడా బంద్ చేపట్టింది. పీవోకేలోని ప్రతి ఒక్కరూ బయటకు రావాలని, తమ హక్కుల కోసం గొంతెత్తాలని అవామీ యాక్షన్ కమిటీ సభ్యుడు సౌకత్ నవాజ్ మీర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా గోధుమ పిండిని రాయితీపై పంపిణీ చేయాలన్నారు.

ఫుడ్ లేబుళ్లపై ఉన్నదంతా నిజమనుకోవద్దు!

ప్యాకేజ్డ్ ఆహారంపై ఐసీఎంఆర్ సూచనలు

న్యూఢిల్లీ, మే 12: ప్యాకేజ్డ్ పదార్థాలపై ఉండే ఫుడ్ లేబుళ్లు తప్పు దోవ పట్టించే అవకాశం ఉన్నదని భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) వినియోగదారులను హెచ్చరించింది. వాటిపై ఉన్న సమాచారాన్ని జాగ్రత్తగా చదివి ఆరోగ్యకరమైన వాటిని ఎంపిక చేసుకోవాలని సూచించింది. ఇటీవల అనేక సమీక్షల అనంతరం జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)తో కలిసి ఐసీఎంఆర్ భారతీయుల ఆహారంపై కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఫ్రూట్ జ్యూస్‌లలో కేవలం 10 శాతం మాత్రమే పండ్ల గుజ్జు ఉండొచ్చని తెలిపింది. 'కఠిన ప్రమాణాలు అమల్లో ఉన్నా లేబుళ్లపై ఉన్న సమాచారం తప్పు దోవ పట్టించవచ్చు' అని ఐసీఎంఆర్ తెలిపింది. 'నేచురల్' ఫుడ్ ప్రొడక్ట్ అంటే ఎలాంటి రంగులు, ఫ్లేవర్స్ కలపకుండా, తక్కువ ప్రాసెసింగ్ చేసిన ఆహారం. కానీ తయారీదారులు రెండు, మూడు సహజసిద్ధమైన పదార్థాలను వాడినా తమది నేచురల్ ఫుడ్ అని లేబుల్‌పై ముద్రిస్తున్నారని ఉదాహరించింది.

ఇజ్రాయెల్‌కు ఇరాన్ 'అణు బాంబు' హెచ్చరిక

టెహ్రాన్, మే 12: ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఇరాన్ అణు హెచ్చరిక జారీ చేసింది. తమ దేశ ఉనికికి ప్రమాదం వాటిల్లితే తమ అణు విధానాన్ని మార్చుకుంటామని పేర్కొన్నది. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ సలహాదారు కమల్ ఖర్రజి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పటి వరకు అణు బాంబు తయారు చేయాలని మేము నిర్ణయించలేదు. ఇరాన్ ఉనికికి ప్రమాదం వాటిల్లితే మేము మా అణు విధానాన్ని మార్చుకోవడం తప్ప మాకు మరో మార్గం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఏప్రిల్‌లో సిరియా రాజధాని లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై బాంబు దాడి జరగడం, తర్వాత ఇజ్రాయెల్ పైకి ఇరాన్ డ్రోన్లు, మిస్సైళ్లు ప్రయోగించడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి.

నిజ్జర్ హత్య కేసులో మరో భారతీయుడి అరెస్ట్

అమన్‌దీప్ సింగ్

ఒట్టావా, మే 12: గతేడాది జూన్‌లో హత్యకు గురైన ఖలిస్థాన్ వేర్పాటువాది నిజ్జర్ హత్య కేసులో మరో భారత జాతీయుడిని అరెస్ట్ చేసినట్టు కెనడా పోలీసులు వెల్లడించారు. తాము అరెస్ట్ చేసిన వ్యక్తి బ్రాంప్టన్‌లో నివసించే అమన్‌దీప్ సింగ్(22) అని తెలిపారు. నిందితుడిపై ఫస్ట్-డిగ్రీ మర్డర్, హత్యకుట్ర పన్నారన్న అభియోగాలపై కేసు నమోదు చేశామని చెప్పారు. నిజ్జర్ హత్య కేసులో ఇప్పటికే ముగ్గురు భారత పౌరులను కెనడా పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐఐటీయన్లకూ కొలువులు దొరకట్లే!

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో చాలా మందికి దక్కని ఉద్యోగాలు
- ఆర్టీఐ ద్వారా వెల్లడి

న్యూఢిల్లీ, మే 12: దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలుగా భావించే ఐఐటీల్లో చదివే విద్యార్థులకు కొలువులు లభించడం కష్టమవుతున్నది. గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభమైన ప్లేస్‌మెంట్ సీజన్ త్వరలో ముగియనున్నది. అయితే ప్లేస్‌మెంట్ గణాంకాలను చూస్తే విద్యార్థులకు నిరాశే ఎదురవుతున్నది. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కోసం దరఖాస్తు చేసుకొన్న వారిలో చాలా మందికి ఇప్పటికీ ఉద్యోగం లభించకపోవడం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతున్నది. సమాచార హక్కు చట్టం కింద ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్ సింగ్ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ వివరాలను సేకరించారు.

ఐఐటీ	ప్లేస్‌మెంట్ దరఖాస్తుదారులు	ఉద్యోగాలు రానివారు
గాంధీనగర్	398	235
ధన్‌బాద్	1595	642
ధార్వాడ్	200	137
రూర్కీ	1762	806
భిలాయ్	208	133

విజయ్ డ్యూయల్ రోల్

అగ్ర హీరో విజయ్ దేవరకొండ సినిమాల వేగాన్ని పెంచాడు. ప్రస్తుతం మూడు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయన పుట్టిన రోజు సందర్భంగా రెండు కొత్త చిత్రాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్ అందరిలో ఆసక్తిని పెంచింది. 1854 నుంచి 1878 మధ్య జరిగే కథ అని పోస్టర్ మీద పేర్కొనడంతో ఈ సినిమా ఇతివృత్తం గురించి ప్రేక్షకుల్లో ఉత్సుకత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ద్విపాత్రాభినయంలో కనిపించబోతున్నారని తెలిసింది. రాహుల్ సంకృత్యాన్ గత చిత్రం 'శ్యామ్‌సింగరాయ్'లో నాని డ్యూయల్ రోల్‌ను పోషించిన విషయం తెలిసిందే. తాజా చిత్రంలో సైతం దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ డ్యూయల్ రోల్‌లో హీరో పాత్రను డిజైన్ చేశారని అంటున్నారు. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

డేట్స్ ఖాళీ లేవు!

కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీ కౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా..డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ పక్కా

చిత్రం

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రాబోతున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 15న రామ్ పుట్టిన రోజుని పురస్కరించుకొని టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో రామ్ ఫేస్ మాస్క్ ధరించి పవర్‌ఫుల్ మాస్ లుక్‌తో కనిపిస్తున్నారు. 'ప్రస్తుతం ప్రధాన తారాగణం పాల్గొనగా ముంబయిలో చిత్రీకరణ జరుపుతున్నాం. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు డబుల్ యాక్షన్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ. రామ్ మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపిస్తారు' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాయి కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

రణ్‌వీర్‌సింగ్ 'బ్రహ్మరాక్షస'?

'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో పేరు సంపాదించుకున్నాడు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ఆయనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు కూడా ఆసక్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రణ్‌వీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ ఓ సినిమా చేయబోతున్నాడని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఈ ఏడాదే సెట్స్‌మీదకు వెళ్లనుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి 'బ్రహ్మరాక్షస' అనే టైటిల్‌ను ఖరారు చేశారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, అన్ని భాషల్లో అదే టైటిల్ ఉంటుందని అంటున్నారు. 'హనుమాన్' సినిమా తరహాలోనే సూపర్‌హీరో కథాంశంతో 'బ్రహ్మరాక్షస' తెరకెక్కనుందని, భారీ సాంకేతిక హంగులతో తీయబోతున్నారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ప్రస్తుతం ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్'పై దృష్టిపెట్టారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'బ్రహ్మరాక్షస' పట్టాలెక్కనుంది.

వివాదంలో కరీనాకపూర్ పుస్తకం

అగ్ర కథానాయిక కరీనాకపూర్ రాసిన 'కరీనాకపూర్ ఖాన్స్ ప్రెగ్నెన్సీ బైబిల్' పుస్తకం వివాదాల్లో చిక్కుకుంది. ఈ పుస్తకం టైటిల్ ఓ వర్గం ప్రజల మనోభావాలను కించపరిచేలా ఉందంటూ మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయవాది క్రిష్టోఫర్ ఆంథోని అక్కడి హైకోర్టులో కేసు వేశారు. బుక్ టైటిల్‌లో 'బైబిల్' అనే పదాన్ని ఉపయోగించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ''బైబిల్' ప్రచంచవ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ల పవిత్రగ్రంథం. పబ్లిసిటీ కోసం కరీనా కపూర్ 'బైబిల్' పేరును వాడుకుంటోంది. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలి' అని క్రిష్టోఫర్ ఆంథోని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం కరీనాకపూర్‌తో పాటు పుస్తక ప్రచురణ సంస్థకు నోటీసులు జారీ చేసింది. కరీనాకపూర్ రాసిన ఈ పుస్తకం 2021లో విడుదలైంది. ఆ సమయంలో క్రిష్టోఫర్ ఆంథోని క్రింది కోర్టులలో వేసిన పిటిషన్స్ చెల్లలేదు. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. టైటిల్‌లో 'బైబిల్' పదాన్ని ఎందుకు ఉపయోగించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని కోర్టు నోటీసుల్లో పేర్కొంది. గర్భిణులు పాటించాల్సిన ఆహార నియమాలు, ఫిట్‌నెస్ సీక్రెట్స్‌తో పాటు శారీరక, మానసిక సమస్యలను ఎలా అధిగమించాలనే విషయాలను చర్చిస్తూ కరీనాకపూర్ ఈ పుస్తకాన్ని రచించారు.

ఆత్మల నేపథ్య కథాంశంతో..

సాయివిజ్కి సంస్థ రూపొందించిన చిత్రం 'అక్కడవారు ఇక్కడ ఉన్నారు'. స్వీయనిర్మాణ దర్శకత్వంలో కుందుర్తి త్రివిక్రమ రావు తెరకెక్కించారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని ఓ గీతాన్ని ఇటీవల తెనాలిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో విడుదల చేశారు. దర్శకనిర్మాత కుందుర్తి త్రివిక్రమరావు మాట్లాడుతూ 'అతి తక్కువ వ్యయంతో సింగిల్ షెడ్యూల్‌లో ఈ చిత్రాన్ని పూర్తి చేశాం. హత్య చేయబడ్డ ఇద్దరి వ్యక్తుల ఆత్మలు ఓ గ్రామంలోకి ప్రవేశించి ఏం చేశాయన్నదే చిత్ర కథాంశం' అన్నారు. సాయిహర్షిణి, యస్.వి.రమణ, కేవీ రమణ, పి.లలిత, పిల్లి విజయ్ కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజుకేశన్న, సంగీతం: శ్రీవెంకట్, పాటలు, కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం: కుందుర్తి త్రివిక్రమరావు.

ఆస్కార్ శతాబ్ది ఉత్సవాలకు 4వేల కోట్లు!

ప్రపంచ సినిమాలో ఆస్కార్ పురస్కారాలను తలమానికంగా భావిస్తారు. వివిధ దేశాలకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఆస్కార్‌ను గెలుచుకోవడం తమ లైఫ్‌టైమ్ డ్రీమ్‌గా చెప్పుకుంటారు. అంతటి పేరుప్రఖ్యాతులు కలిగిన ఆస్కార్ పురస్కారాల శతాబ్ది ఉత్సవాల కోసం సన్నాహాలు మొదలయ్యాయి. 2028లో నిర్వహించనున్న ఆస్కార్ అవార్డుల వందో వేడుక కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆస్కార్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 500 మిలియన్ డాలర్లను (దాదాపు నాలుగు వేల కోట్లు) సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే వంద మిలియన్ల డాలర్లను సేకరించామని, ప్రపంచ సినిమా చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయేలా ఈవెంట్‌కు సన్నాహాలు చేస్తున్నామని ఆస్కార్ కమిటీ సీఈఓ బిల్ క్రామోర్ ఇటీవలే వెల్లడించారు. గత మార్చిలో 96వ ఆస్కార్ పురస్కారాల ప్రదానోత్సవం జరిగిన విషయం తెలిసిందే. 97వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చి 2న జరగనుంది.

హత్య కేసు పరిశోధనలో

'ఆర్.ఎక్స్ 100' 'మంగళవారం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది పాయల్ రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రక్షణ'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ప్రణదీప్ ఠాకూర్ తెరకెక్కిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. 'క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథాంశమిది. పాయల్ రాజ్‌పుత్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఆమె పాత్ర సాగుతుంది. ఒక హత్యా నేరానికి సంబంధించిన పరిశోధనలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయనేది ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటిగా పాయల్ రాజ్‌పుత్‌కు కొత్త ఇమేజ్‌ను తీసుకొచ్చే చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్ బాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిల్ బండారి, సంగీతం: మహతి స్వరసాగర్, నిర్మాతలు: ప్రకాష్ జోసెఫ్, రమేష్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శరద్‌వాఘ్రే, నిర్మాణం, దర్శకత్వం: ప్రణదీప్ ఠాకూర్.